రైతు దీక్షకు మద్దతు తెలుపుతున్న దివ్యాంగుడు మామిడి సంపత్‌కుమార్

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కొప్పుల ఈశ్వర్, నాయకులు

హాజరైన కార్యకర్తలు

రైతు నిరసన దీక్ష విజయవంతం

రైతులకు సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, ఇతర నాయకులు

పెద్దపల్లి, మార్చి 31(నమస్తే తెలంగాణ)/ పెద్దపల్లి: బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో చేపట్టిన 36గంటల రైతు దీక్ష విజయవంతంమైంది. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలతో పాటు ధర్మారం మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అంతా 36గంటల పాటు పార్టీ కార్యాల యంలోనే ఉండి రైతులకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లోని రైతులు ఎండిన వరి పైరును చేత భూని నిరసన కార్యక్రమానికి తరలివచ్చారు. దీక్షలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలు మిన్నంటాయి. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మద్దతుగా నినాదాలు మార్మోగాయి.

రైతులను ఆదుకోవాలని వినతి

జిల్లాలో ఎండుతున్న పంటలను కాపాడి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో చేపట్టిన '36 గంగల రైతు నిరసన దీక్ష'లో భాగంగా నాయకులు ఆదివారం కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకొని అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్‌కు వినతి పత్రం సమర్పించారు. పంటకు సాగునీరు ఇవ్వాలని, నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, క్వింటాలుకు రూ.500ల బోనస్ చెల్లించాలని, రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని, ఎకరాకు రూ.15 వేల రైతు బంధు విడుదల చేయాలని, బ్యాంకు అధికారుల బలవంతపు రుణ వసూళ్లను ఆపాలని, రైతు బీమా రెన్యువల్ చేయాలని, ఎస్సారెస్పీలో ఉన్న నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు బండారి స్రవంతి శ్రీనివాస్, రమాదేవి, నూనేటి సంపత్, బాలజీరావు, జడ్పీటీ సీలు ఆముల నారాయణ, తగరం సుమలతశంకర్ లాల్, ఓదెల మల్లికార్జున స్వామి చైర్మన్ మేకల మల్లేశం యాదవ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పెంట రాజేశ్, ఉప్పు రాజ్‌కుమార్, రమణారావు, పీటీ స్వామి, మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, కొయ్యడ సతీష్, అనంతరెడ్డి, మామిడి సంపత్‌కుమార్, హన్మంతరావులతో పాటు అధిక సంఖ్యలో నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుదీక్ష కు మద్దతు

ముత్తారం, మార్చి 31: పెద్దపల్లిలోని తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ , జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తలపెట్టిన 36 గంటల రైతు నిరసన దీక్షకు మండలంలోని పలు గ్రామాల రైతులు, నాయకులు తరలివెళ్లి మద్దతు ప్రకటించారు. ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఇక్కడ ముత్తారం గ్రామ శాఖ అధ్యక్షులు అలువోజు రవీందర్ చారి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చల్ల సమ్మయ్య, సింగిల్ విండో డైరెక్టర్ గిరి వీరేందర్, మాజీ ఉపసర్పంచ్ దేవనూరి సతీష్ , మల్లేశ్, రాగుల రాజేశం, పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల పక్షాన పోరాడుతాం

మాపై కోపం ఉంటే కిందిస్థాయి నుంచి కేసీఆర్ వరకు మమ్ములను జైళ్లలో పెట్టండి. కానీ, రైతులపై పగబట్టకండి. ఎన్నికల ముందు ఎవరికన్నా ముల్లు కుచ్చితేనే ఆగమాగమైన నాయకులు ఇప్పుడు పంటలు ఎండి రైతులు ఆత్మహత్యలు చేసుంటుంటే అటు వైపు చూడడం లేదు. కేసీఆర్ సర్కార్ ప్రణాళికాబద్ధంగా సాగునీరు ఇచ్చింది. తొమ్మిదిన్నరేళ్లల్లో ఒక్క ఎకరం పొలం ఎండనియ్యలేదు. డీ-83, 86కు ఇచ్చిన ప్రకారం సాగు నీటిని ఇవ్వకపోతే కాంగ్రెస్ సర్కారుపై హైకోర్టులో కేసు వేస్తా. రైతుల పక్షాన పోరాడుతాం. షెడ్యూల్ ప్రకారం నీళ్లివ్వని కాంగ్రెస్ నాయకులను ఏ జైల్లో పెట్టాలి.

- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

సర్కారు మెడలు వంచుతాం

సాగు నీరందక ఎండిన పొలాలకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలి. దీని కోసం రాష్ట్ర సర్కారు మెడలు వంచైనా రైతుకు న్యాయం చేస్తాం. పరిహారం ఇవ్వకుంటే ప్రజా క్షేత్రంలో పోరాడుతాం. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో 200ల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రైతులు గుణపాఠం చెబుతారు. ఈ 36 గంటల రైతు నిరసన దీక్షతో యావత్ తెలంగాణ రైతాంగాన్ని కదిలించాం.

- బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

ఓట్ల మీదున్న శ్రద్ధ రైతులపై లేదు

కాంగ్రెస్ నేతలకు ఓట్ల మీదున్న శ్రద్ధ రైతులపై లేదు. పార్లమెంటు ఎన్నికల్లో రైతుల ఓట్లను క్యాచ్ చేసుకునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును బూచిగా చూపుతున్నది. నిజంగా రైతుపై శ్రద్ధ ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించి సాగు నీరందించాలి. సాగునీరు లేక పంట ఎండిపోతుంటే రైతులు రోడ్డెక్కుతున్నా వారి ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితుల్లో లేదు. ఇప్పటికైనా స్పందించి ప్రమాదంలో ఉన్న పంట పొలాలను కాపాడాలి. పంటలు ఎండి నష్టపోయిన రైతులకు పరిహారాన్ని చెల్లించాలి. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్కసీటు రాకుండా చేసి ఆ పార్టీని పాతరేయాలని రైతులను కోరుతున్నా. బీఆర్ఎస్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలి.

- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

జూలపల్లి, మార్చి 31 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-1994 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులకు 30 ఏళ్లకు మళ్లీ కలుసుకున్నారు. ఈ క్రమంలో బాల్య మిత్రులంతా ఒక చోట చేరి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుని ఆత్మీయతలు, ప్రేమానురాగాలు పంచుకున్నారు. భవిష్యత్‌లో ఒకరికొకరూ తోడుగా ఉందామని ఆలింగనం చేసుకున్నారు. చదువులమ్మ ఒడిలో రోజంతా ఆట పాటలతో సందడి చేసి సంతోషంగా గడిపారు. చదువు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు గుర్రం రాంరెడ్డి, సింగిరెడ్డి మోహన్‌రెడ్డి, ఉమ్మెత్తల రఘురాంరెడ్డి, రాంకిషన్‌రావు, సరస్వతి, గడ్డం దశరథ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ దేవనపెల్లి లక్ష్మణ్‌లను సన్మానించి పాదాభివందనం చేశారు. జ్ఞాపికలు అందజేసి గురుభక్తిని చాటుకున్నారు. కొంతమంది పూర్వ విద్యార్థులు మృతి చెందగా, వారి ఆత్మకు శాంతి చేకూరాలని చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు.

లాన్ టెన్నిస్ అభివృద్ధికి కృషి

టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్

అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్‌ను సన్మానిస్తున్న క్రీడాకారులు

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 31 : రాష్ట్రంలో లాన్ టెన్నిస్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో గల టెన్నిస్ కోర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఆయనను సన్మానించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో గల లాన్ టెన్నిస్ క్రీడా మైదానాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లాన్ టెన్నిస్‌ను విస్తరించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. దీనికి అనుగుణంగానే రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న క్రీడా మైదానాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పారిశ్రామిక ప్రాంతంలో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో రోజురోజుకు లాన్ టెన్నిస్ పట్ల ఆసక్తి పెరుగుతుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పింగిళి కృష్ణారెడ్డి, క్రీడాకారులు పెరుమాండ్ల శ్రీనివాస్,వెంకట చంద్రశేఖర్, మేరుగు శేఖర్, శశిధర్, బెక్కం రవి, సురేందర్ ఉన్నారు.

ధర్మారంలో ఇఫ్తార్

ధర్మారం,మార్చి31:ధర్మారంలోని మసీద్‌లో ఆదివారం నిర్వహించిన ఇఫ్తార్‌కు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరైనారు. మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ జహీర్ ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమం లో మైనార్టి నాయకులు ఎండీ బాబా,ఎండీ హఫీజ్, ఎండీహుస్సేన్, అబ్దుల్ ముజాయిద్, కాంగ్రెస్టు మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, నాయకులు పాలకుర్తి రాజేశం,కొత్త నర్సింహం,తాళ్లపల్లి లింగయ్య,చింతల జగన్మోహన్ రెడ్డి,దేవి జనార్దన్,కాడె సూర్యనారాయణ, దేవేందర్ రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్‌రూరల్,మార్చి31: మండలంలోని సుద్దాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓదెల గ్రామానికి చెందిన బైరి శ్రీని వాస్(48)అనే వ్యక్తి సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ కషర్‌లో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై సుల్తానాబాద్ వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున క్రమంలో సుద్దాల శివారులోని రాహదారిపై ప్రమాద వశాత్తు ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీనివాస్ అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుడి కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో తల్లిపై దాడి

మంథని రూరల్, మార్చి 31: మద్యం మత్తులో తల్లి పైనే కత్తితో దాడికి పాల్పడి హత్యాయత్నం చేయబోయాడో ప్రబుద్ధుడు. మంథని ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంథని మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన తీగల శాంత చిన్న కుమారుడు హరీశ్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం డబ్బులు ఇవ్వమని గొడవకు దిగేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తల్లి శాంతను డబ్బులు ఇవ్వాలని దూషించడంతో పాటు కొట్టాడు. అంతటితో ఆగకుండా తల్లిని హత్య చేయాలని కత్తితో వీపులో దాడి చేసి వెళ్లిపోయాడు. హత్యాయత్నం చేసిన హరీశ్‌పై చర్యలు తీసుకోవాలని శాంత కుమార్తె మమత ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని శనివారం రాత్రి అరెస్టు చేశారు.

బాధిత కుటుంబానికి సాయం

కమాన్‌పూర్, మార్చి 31: మండల కేంద్రానికి చెందిన కొత్తగాండ్ల వెంకటేశ్ ఇటీవల మృతి చెందాడు. తల్లి అమృతమ్మకు కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, లయన్ సభ్యులు లయన్ కోలేటి మారుతి, ఇనగంటి భాస్కరరావు సాయంతో 50 కిలోల బియ్యం, నగదు అందజేశారు. ఇక్కడ లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, లయన్స్‌క్లబ్ సభ్యులు జబ్బార్ ఖాన్ ఉన్నారు.

ఇసుక లారీ సీజ్

మంథని, మార్చి 31: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసినట్లు మంథని ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో కూచిరాజ్‌పల్లి గ్రామ శివారులో లారీని పట్టుకున్నామన్నారు. కాటారం మండలం దేవరాంపల్లి కి చెందిన లారీ డ్రైవర్ సయ్యద్ ముజాహిద్ తన ఓనర్ ఎండీ గోరిమా చెప్పిన విధంగా మంథని శివారులోని డంప్ యార్డు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవా ణా చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేశామన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా వార్షికోత్సవం

ధర్మారం,మార్చి31: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం బ్రిలియంట్ మోడల్ హైస్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై మాట్లాడారు. వివిధ జిల్లాలను కలుపుతో ఎన్నో మండలాలకు అనుసంధానంగా ఉన్న ధర్మారం మండల కేంద్రానికి రాబోయే రోజుల్లో పాలిటెక్నిక్,ఐటీఐ,డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయించడానికి తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు. 29 ఏళ్లుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యనందిస్తున్న పాఠశాల చైర్మన్ సిరిపురం సత్యనారాయణను అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్‌ను పాఠశాల నిర్వాహకులు సన్మానించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

పోస్టర్ విడుదల

ముత్తారం, మార్చి 31: మండలంలోని లక్కారం గ్రామంలో నిర్వహించనున్న శ్రీ కోండడరామాలయ బ్రహ్మోత్సవాల పోస్టర్ ను మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి ఆదివారం విడుదల చేశారు. ఈ నెల 5న బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇక్కడ మాజీ సర్పంచ్ కుమారస్వామి, సదానందం, కుమార్, మోహన్, రాజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుంగ్ ఫూ క్రీడాకారుల విన్యాసం

కరాటే పోటీలో ప్రతిభ

ధర్మారం,మార్చి31: డ్రాగన్ స్వార్డ్ కుంగ్ ఫూ అకాడమీ ఆధ్వర్యంలో ధర్మారంలోని వైశ్య భవన్‌లో నిర్వహించి న ఇంటర్ డోజో స్పారింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపా రు. ఈ పోటీలను మాస్టర్ బీ రాజమల్లు ఆధ్వర్యంలో నిర్వహించగా మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో డీ యజ్ఞవలక్య, డీ. సిద్ధార్థ, ఎన్. ప్రియదర్శిని, జీ విష్ణేష్, ఆర్ అర్జున్ తేజ, ఏ. సాన్విత్ వర్మ ప్రథమ స్థానంలో నిలిచారు. జీ మైత్రేయి, బీ సహన్స్, కే అశ్విత్, జీ రామ్ చరణ్, డీ రిషిత్ వర్మ ద్వితీయ స్థానం సాధించినట్లు మాస్టర్ రాజమల్లు తెలిపారు. విజేతలకు మెమొంటోలు అందజేసి అభినందించారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

పాశం కార్తీక

వేణుగోపాల్‌రెడ్డి

జూలపల్లి, మార్చి 31 : మండల కేంద్రంలోని 'జూపిటర్' ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి దాకా చదివిన ఇద్దరు విద్యార్థులు నవోదయ పాఠశాలల్లో సీట్లు సంపాదించారు. జూలపల్లికి చెందిన పాశం కార్తీక, అబ్బాపూర్ గ్రామానికి చెందిన గన్ను వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షలకు హాజరై సత్తా చాటారు. 2024-2025 విద్యా సంవత్సరంలో వారు ఆరో తరగతిలో ప్రవేశాలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అందె కుమారస్వామి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ధర్మారం నుంచి..

విద్యార్థులను అభినందిస్తున్న సురేశ్ కుమార్

ధర్మారం, మార్చి 31: మండల కేంద్రంలోని పలు పాఠశాలల విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాలకు అర్హత సాధించారు. సాయి మణికంఠ, మోడల్ హైస్కూల్ విద్యార్థులు బీ అర్జున్, ఆర్ ప్రహ్లాద్, డీ సాయి దీక్షిత్, సీహెచ్ ప్రసన్నకుమార్ ఎంపికైనట్లు కరస్పాండంట్ జైన సురేశ్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసి కార్యక్రమలో అభినందించారు. స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థి అసాది నిత్య వర్షిణి నవోదయకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బుదారపు రమాదేవి, కరస్పాండెంట్ బుదారపు మహేందర్ తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం

మంత్రి శ్రీధర్ బాబును సన్మానిస్తున్న నాయకులు

మంథని, మార్చి 31: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును బోయినిపేటకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం సన్మానించారు. హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఎన్నిక కావడంపై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పోలు శివ, గుండా రాజు, భయ్య లింగయ్య, నరేడ్ల కిరణ్, నడిపి రాజయ్య, అట్టెం రాజయ్య పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

ఓదెల, మార్చి 31: ఓదెలకు చెందిన గట్టు స్వామిగౌడ్ తాటి చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. వృత్తిరీత్యా రోజులాగే తాటిచెట్టు ఎక్కి కిందకు దిగుతుండగా కాలు జారీ పడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో వెంటనే కరీంనగర్ దవాఖానకు తరలించి చికిత్స జరిపిస్తున్నారు.

ఆయన కళ్లు సజీవం

రాజం(ఫైల్)

కోల్‌సిటీ, మార్చి 31: మరణించినా... ఆయన కళ్లు మాత్రం ఈ లోకాన్ని చూస్తూనే ఉన్నాయి. గోదావరిఖని తిరుమల్‌నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఆర్ల రాజం (67) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. రాజం నేత్రాలను దానం చేసే మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన వారవుతారని కాలనీకి చెందిన గట్ల రమేశ్ అతని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. భార్య నర్సమ్మ, కుమారుడు సతీశ్, కూతుర్లు సువర్ణ, స్వరూప, స్రవంతి స్పందించారు. రాజం నేత్రాలను దానం చేయడానికి అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు రాజమౌళి ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ మృతుడి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. రాజం నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను ఫౌండేషన్ సభ్యులు శ్రావణ్ కుమార్, లింగమూర్తి, భీష్మాచారి, రామకృష్ణారెడ్డి, నూకా రమేశ్, కేఎస్ వాసు, అన్నపూర్ణ, చంద్రశేఖర్, శారద అభినందించారు.

కరెంట్ షాక్‌తో మహిళ మృతి

మంథని రూరల్, మార్చి 31: కరెంట్ షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మంథని మండలం విలోచవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బోగిరి లక్ష్మి(44) విలోచవరంలోని తన బంధువుల ఇంట్లో వివాహానికి హాజరైంది. ఆదివారం ఉదయం ఇనుప కూలర్ ప్రమాదవశాత్తు తగడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన వివరాలు సేకరించారు. సోదరుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

గ్రామాల్లో జోరుగా సాగుతున్న బెల్టు దందా

మంథని, మార్చి 31: డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో అన్ని గ్రామాల్లో బెల్టు షాపు దందాపు జోరుగా కొనసాగుతుంది. గ్రామాల్లో అధిక రేట్లకు మద్యం విక్రయిస్తూ కొంత మంది అక్రమార్కులు కాసులు సంపాదిస్తున్నారు. మంథనితో పాటు ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల్లో రాత్రీపగలూ అనే తేడా లేకుండా విచ్చల విడిగా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. వ్యాపారుల కనుసన్నల్లో బెల్టు షాపుల నిర్వాహకులు మూడు క్వార్టర్లు, ఆరు బీర్లుగా తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నేరుగా వైన్స్ షాపుల నుంచి ఆటోలు, ట్రాలీలు, టూ వీలర్స్ ద్వారా నిత్యం పెద్ద ఎత్తున వివిధ బ్రాండ్ల మద్యం, బీరు బాటిళ్ల కాటన్లను గ్రామాల్లోని బెల్టు షాపులకు తరలిస్తున్నారు. అక్కడ అధిక రేట్లకు మద్యం విక్రయిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. బెల్టు షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయాల కారణంగా మద్యం ప్రియులు జేబులకు తూట్లు పడుతున్నాయి. చిన్నాచితక పను లు, కూలీ పనులు చేసుకునే వారంతా తమ సంపాదనను మద్యానికే ఖర్చు చేసుకునే పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఒక్కో గ్రామంలో 3 నుంచి 5 వరకు బెల్టుషాపులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో, పట్టణంలో చాలా మంది విద్యార్థులు, యువత మద్యం ప్రియులుగా మారుతున్నారు. మంథని పట్టణంతో పాటు డివిజన్‌లోని ఆయా గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతునప్పటికీ సంబంధిత ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు స్పందించి విచ్చలవిడి కొనసాగుతున్న బెల్టు షాపులను ఆరికట్టాలని పలువురు కోరుతున్నారు.